## కేసీఆర్ బహిరంగ సభ
# ఏర్పాట్ల పరిశీలన

- నవంబర్ 7న పెద్దపల్లికి సీఎం రాక

పెద్దపల్లి, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల (నవంబర్)7న సీఎం కేసీఆర్ పెద్దపల్లి జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి నియోజకవర్గ ప్రచార ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, అజయ్ గౌడ్, పెండ్యాల మహేశ్, కేమసారం తిరుపతి ఉన్నారు.



పెద్దపల్లిలోని సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దాసరి మనోహర్ రెడ్డి, సర్దార్ రవీందర్ సింగ్

# రైస్ మిల్ ఇండస్ట్రీకి కేసీఆర్ అండ

- కాంగ్రెస్ హయాంలో కుదేలైన పరిశ్రమకు చేయూత
- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ రవీందర్‌సింగ్
- రైస్‌మిల్లర్లతో ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిని సన్మానిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

పెద్దపల్లి, అక్టోబర్ 31: రైస్ మిల్ ఇండస్ట్రీకి సీఎం కేసీఆర్ అండగా ఉంటారని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సర్దార్ రవీందర్‌సింగ్ రైస్ మిల్లర్లను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాసరి మనోహర్ రెడ్డితో కలిసి రవీందర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ సాగు నీరు, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో రైస్ మిల్ ఇండస్ట్రీ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రైస్ మిల్లర్లకు సమస్యలుంటే పరిష్కరించేందుకు బీఆర్ఎస్ సర్కారు ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. సమైక్య పాలనలో కుదేలైన రైస్ మిల్ ఇండస్ట్రీకి చేయూతనందించే విధంగా సీఎం కేసీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. బీఆర్ఎస్ రైస్ మిల్లర్లకు ఎప్పుడు అండగా ఉంటుందని, పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి రైస్ అసోసియేషన్ నాయకులు దేవేందర్ రెడ్డి, అశోక్, రమణా రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీ సత్యనారాయణరెడ్డి, వేముల రాంమ్మూర్తి, గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి పాల్గొన్నారు.

### రైస్‌మిల్ ఇండ్రస్టీని కాపాడింది సీఎం కేసీఆరే

రైస్ మిల్లర్ల సంక్షేమం, ఇండస్ట్రీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ లేకుండా కేవలం తెల్ల కాగితం మీద రాసి ఇస్తేనే ధాన్యాన్ని ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానికే దక్కింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో నియోజకవర్గంలో రెండు పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెద్దపల్లి నియోజకవర్గంలోనే రైస్‌మిల్లులు అధికంగా ఉన్నాయి. సమైక్య పాలనలో ఎలాంటి ప్రోత్సాహం అందించలేదు. ఎన్నో కష్టాలను అనుభవించాం. స్వరాష్ట్రంలో రైస్‌మిల్ ఇండ్రస్టీని కాపాడింది సీఎం కేసీఆరే. ఈ విషయాన్ని మరిచిపోవద్దు. బీఆర్ఎస్‌కు అండగా నిలువాలి. మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలి.

**- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి**

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమ ఫలాలు

- కాంగ్రెస్‌ను నమ్మితే గోస తప్పదు
- ఆ పార్టీ హయాంలో బురద రోడ్లు
- నేడు కేసీఆర్ పాలనలో తారు రోడ్లు
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి
- దాసరికి అడగడుగునా ఘన స్వాగతం



పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటలో ఎమ్మెల్యే దాసరికి నాగలి బహూకరిస్తున్న కార్యకర్త

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 31: బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటేనే అందరికీ సంక్షేమఫలాలు అందుతాయని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎటూ చూసినా మోకాళ్ల లోతు బురద రోడ్లు దర్శనమిచ్చేవని గుర్తు చేశారు. కానీ, సీఎం కేసీఆర్ పాలనలో ఎటు చూసినా తారు రోడ్లు కనిపిస్తున్నాయని, కాలికి మట్టి అంటకుండా తయారయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెసోళ్లను నమ్మితే మోసపోవుడు ఖాయమని, మరోసారి గోస తప్పదని హెచ్చరించారు. పెద్దపల్లి మండలంలోని భోజన్నపేటలో మంగళవారం రాత్రి ఇంటింటికి ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దాసరికి మహిళలు, గ్రామస్తులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. దాసరి ఇంటింటికి వెళ్లి మహిళలు, వృద్ధులు, యువకులను ఆప్యాయంగా పలుకరించారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రైతుబంధు మాదిరిగా గుంటభూమిలేని పేద కుటుంబాలకు సైతం రూ.పది వేలను సాయంగా అందించనున్నట్లు తెలిపారు. తనను ఎమ్మెల్యేగా మళ్లీ ఆశీర్వదించి, సీఎం కేసీఆర్‌కు పెద్దపల్లిని కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండారి స్రవంతీ శ్రీనివాస్ గౌడ్, పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహారెడ్డి, సర్పంచ్ మేకల మల్లేశం యాదవ్, నాయకులు బాలసాని ఈశ్వర్, ఆవుల రాజకిషన్ యాదవ్, శ్రీనివాస్, ఎల్లారెడ్డి, మిషన్ రాజయ్య, గోస్కుల లింగయ్య, సంతోశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తచరిత్ర సృష్టించేందుకు
# కాంగ్రెస్ యత్నం

బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను తట్టుకోలేకే హింసాత్మక ఘటనలు

- దుబ్బాక అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం అమానుషం
- పచ్చదనంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేది కేసీఆర్
- రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, అక్టోబర్ 31: తెలంగాణలో రక్తచరిత్రను సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండిపడ్డారు. మంగళవారం గోదావరిఖనిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం అమానుషమని తీవ్రంగా ఖండించారు. 14ఏండ్ల పాటు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, ఏనాడూ అహింసకు తావివ్వలేదని, తొమ్మిదిన్నర ఏండ్లల్లో మతకలహాలు, రాజకీయ హత్యలు లేకుండా పాలన కొనసాగించారన్నారు. బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి, ఓటమి భయంతో కాంగ్రెస్ హింసాత్మక ఘటనలకు తెగబడుతున్నట్లు ఆరోపించారు. రామగుండంలో కూడా ఒకప్పటి గుండాలరాజ్యం గుర్తుకువచ్చే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో రక్తచరిత్రను సృష్టించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ఒకవైపు నిలిస్తే.. పచ్చదనంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్ మరోవైపు నిలిచారన్నారు. హింస రాజకీయాలను ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. సమావేశంలో నాయకులు తానిపర్తి గోపాల్‌రావు, మాదాసు రామ్మూర్తి, శంకర్ గౌడ్, మురళీధర్‌రావు, నూతి తిరుపతి, చెల్కలపల్లి శ్రీనివాస్, మండ రమేశ్, చిప్ప రాజేశ్, వంగ శ్రీనివాస్, జక్కుల తిరుపతి, మేడి సదయ్య, కళావతి, రాములు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదునూ పారదర్శకంగా పరిష్కరిస్తాం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్



ఎన్నికల ఫిర్యాదుల కేంద్రం పనితీరును వివరిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, అక్టోబర్ 31: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం ద్వారా నమోదయ్యే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం పనితీరును విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్, భారత ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన ఎన్నికల ప్రవర్త నా నియమావళిని, నిబంధనలను నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘనలపై టోల్ ఫ్రీనెంబర్ 1950, సీ-విజల్ యాప్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదు లు వస్తున్నాయని తెలిపారు. మొబైల్ ఫోన్ నుంచి సీ-విజల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సీ-విజల్ యాప్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని పాత్రికేయులను కోరారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, జిల్లా మైనార్టీ సంక్షే మ శాఖాధికారి మెరాజ్ మహమూద్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి నరహరి, ఈడీఎం కవిత, అధికారులు పాల్గొన్నారు.

## ఓటింగ్ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసుకోండి

రామగిరి, అక్టోబర్ 31 : ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మంథని ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ.హనుమనాయక్ సూచించారు. ఈ మేరకు స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మంథని నియోజక వర్గం ఎన్నికలకు సంబంధించి మంగళవారం పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారులకు మాస్టర్ ట్రైనింగ్ అధికారులు ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హాజరై పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు జరిగే ఒక రోజు ముందు ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన నియమాలు సరిగ్గా చదువుకొని తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని రామగిరి తహసీల్దార్ తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మీడియా సెల్ నోడల్ అధికారి రవీందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.